సాక్షి
కామారెడ్డి
శుక్రవారం ⁝ 28 ⁝ జూలై ⁝ 2023



విద్యార్థులపై శ్రద్ధ ఏది..?

విద్యార్థులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీబీపేట కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ మంగపై జెడ్పీ వైస్‌చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

- 8లో ▸



మోదీ రైతు పక్షపాతి

ప్రధాని నరేంద్ర మోదీ రైతు పక్షపాతి అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
28.5 /23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం నుంచి మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

దోమకొండలో అలుగు పారుతున్న గుండ్ల చెరువు



ముంచెత్తిన వాన

న్యూస్‌రీల్

నల్లవాగు వరదలో ఒకరి గల్లంతు



జంగం కృష్ణ

నిజాంసాగర్(జుక్కల్): స్నేహితులతో కలిసి చేపల వేటకు వెళ్లిన జంగం కృష్ణ గురువారం నల్లవాగు మత్తడి వరద నీటిలో గల్లంతైనట్లు ఎస్సై నాగగోని రాజు తెలిపారు. నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావ్‌పల్లి శివారులో ఉన్న నల్లవాగు మత్తడి వరద నీరు పొంగి పొర్లుతుంది. పిట్లం మండలానికి చెందిన జంగం కృష్ణతో పాటు మరో నలుగురు నల్లవాగు ప్రాంతంలో చేపలు పడుతున్నారు. మత్తడికి వరద మరింత పోటెత్తడంతో కృష్ణ గల్లంతయ్యాడు. మిగితా వారు ఒడ్డుకు చేరుకున్నారు.

వరదలో కొట్టుకుపోయిన ఫిష్‌ఫాం

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలో కురుస్తున్న వర్షాల కారణంగా మండల కేంద్రంలోని కుప్రియాల చిన్న బాబయ్యకు చెందిన ఫిష్ ఫాం వరదతాకిడికి కొట్టుకుపోయింది. ఫిష్‌ఫాంకు రూ.7,80,000 ఖర్చు పెట్టినట్లు బాధితుడు బాబయ్య పేర్కొన్నారు. ఫాంలో పెరిగిన చేపలను వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత పట్టి విక్రయిద్దామని అనుకున్నట్లు పేర్కొన్నారు. ఇంతలోనే భారీ వరద తాకిడికి ఫాంలోకి వరదనీరు వచ్చి చేరడంతో చేపలు పూర్తిస్థాయిలో బయటకు వెళ్లి పోవడంతో బాధితుడు లబోదిబోమంటున్నాడు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

మూడు పంటలకు 'సాగర్' నీళ్లు



నిజాంసాగర్(జుక్కల్) : నిజాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారడంతో మూడు పంటలకు సాగు నీరు అందుతుందని జిల్లా నీటి పారుదలశాఖ సీఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల ఎత్తివేత సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో 1,515 చెరువులకు గాను 90 శాతం మేర చెరువులు అలుగులు దూకుతున్నాయన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు, కౌలాస్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో పాటు పోచారం, కల్యాణి, సింగితం, నల్లవాగు మత్తడి అలుగులు దూకుతున్నాయన్నారు. భారీ వర్షాలకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారన్నారు. సమావేశంలో నీటిపారుదలశాఖ ఈఈ సోలోమాన్, ఎఈ శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

సురక్షిత ప్రాంతానికి బుడగజంగాల తరలింపు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ గ్రామానికి చెందిన బుడగజంగాల కుటుంబాలను గురువారం అధికారులు సురక్షిత ప్రాంతానికి తరలించారు. గ్రామంలో బుడగజంగాల కుటుంబాలు నివసిస్తున్న పూరిగుడిసెలు, ఇళ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో తహశీల్దార్ సయ్యద్ అహ్మద్ మస్రూర్, ఎంపీవో శ్రీనివాస్ గ్రామానికి చేరుకొని అక్కడి పరిస్థితిపై ఆరా తీశారు. బుడగజంగాల కుటుంబాలు నివసిస్తున్న ఇళ్లు ప్రమాదకరంగా ఉండడంతో 11కుటుంబాలకు చెందిన 47మందిని గ్రామంలోని లహరికృష్ణ మందిరానికి తరలించారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టిన తర్వాత మాత్రమే ఇళ్లకు వెళ్లాలని వారికి అధికారులు సూచించారు. సర్పంచ్ గంగమణి, పంచాయతీ కార్యదర్శి బాలరాజ్, బీఆర్ఎస్ నాయకుడు సంగయ్య ఉన్నారు.

ఆర్టీసీ బస్సులు రద్దు

ఖలీల్‌వాడి : నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు 35 రూట్‌లలో 93 బస్సులను రద్దు చేసినట్లు ఆర్ఎం జానీరెడ్డి తెలిపారు. వరంగల్ మార్గంలో ఆర్మూర్ మండలం చేపూర్, జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూడుబొమ్మల మేడిపల్లి వద్ద జాతీయ రహదారి పై వరదనీరు చేరడంతో బస్సులను నిలిపివేసినట్లు తెలిపారు. కామారెడ్డి నుంచి బాన్సువాడ, కామారెడ్డి నుంచి కరీంనగర్, ఆర్మూర్ నుంచి నందిపేట్, భైంసా నుంచి నిజామాబాద్ బస్సులను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో గురువారం 28,576 కి.మీ మేరకు బస్సులు తిరగలేదన్నారు. రూ.11,31,532 ఆదాయం ఆర్టీసీకి నష్టం వచ్చినట్లు తెలిపారు. భారీ వర్షాల దృష్ట్యా ప్రయాణికులు ప్రయాణం వాయిదా వేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు వర్షపాతం

మండలం	మి.మీ.	మండలం	మి.మీ.
మాచారెడ్డి	104.2	నస్రుల్లాబాద్	46.6
కామారెడ్డి	59.5	పిట్లం	29.1
భిక్కనూరు	59.5	నిజాంసాగర్	49.7
పాల్వంచ	56.0	ఎల్లారెడ్డి	47.5
నాగిరెడ్డిపేట	55.3	లింగంపేట	49.9
రామారెడ్డి	50.9	గాంధారి	49.6
దోమకొండ	47.8	సదాశివనగర్	34.1
బాన్సువాడ	49.0	తాడ్వాయి	52.1
మద్నూర్	26.5	రాజంపేట	48.4
జుక్కల్	21.6	బీబీపేట	12.7
బిచ్కుంద	24.1	డోంగ్లీ	20.5

గురువారం మధ్యాహ్నం వరకు..

మండలం	మి.మీ.	రామారెడ్డి	44.8
గాంధారి	77.5	ఎలుపుగొండ	44.5
నస్రుల్లాబాద్	73.3	హసన్‌పల్లి	44.0
ఇసాయిపేట	69.3	బిచ్కుంద	42.8
బొమ్మన్‌దేవ్‌పల్లి	67.5	సదాశివనగర్	42.5
తాడ్వాయి	61.0	పాత రాజంపేట	42.5
కామారెడ్డి	60.3	మక్దుంపూర్	42.3
భిక్కనూరు	52.8	కొల్లూర్	41.3
బీర్కూర్	52.0	మెనూర్	40.5
దోమకొండ	50.0	లింగంపేట	39.3
అర్గొండ	48.3	పుల్కల్	36.8
రామలక్ష్మణ్‌పల్లి	47.3	నాగిరెడ్డిపేట	36.5
పెద్దకొడప్‌గల్	46.3	డోంగ్లీ	35.5
పిట్లం	44.8	మాచాపూర్	31.3

పొంగిన వాగులు, వంకలు

- నిండిన నిజాంసాగర్, కౌలాస్‌నాలా ప్రాజెక్టులు
- వారం రోజులుగా పొంగుతున్న పోచారం ప్రాజెక్టు
- వాగులు పొంగి పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు



సోమారం పేట, నెమిలిగుట్ట తండా మధ్య తెగిపోయిన రోడ్డు



రాజంపేటలోని గుండారంలో రోడ్డుపైన పడిన చెట్టు



గోజేగావ్ వద్ద రోడ్డుపైన పారుతున్న వరద

సాక్షి, కామారెడ్డి : ఆకాశానికి చిల్లు పడ్డట్టుగా వానలు దంచికొట్టాయి. జిల్లావ్యాప్తంగా బుధవారం రాత్రి నుంచి తెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులన్నీ పొంగి ప్రవహిస్తున్నాయి. నిజాంసాగర్, కౌలాస్‌నాలా ప్రాజెక్టులు నిండడంతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. వారం రోజులుగా పోచారం ప్రాజెక్టు అలుగులు పోస్తోంది. సింగితం రిజర్వాయర్, కల్యాణి ప్రాజెక్టులు పొంగాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు జిల్లాలో అత్యధికంగా మాచారెడ్డిలో 10.4సెం.మీ. వర్షపాతం నమోదైంది. మిగితా ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిశాయి. గాంధారి, లింగంపేట ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో పెద్దవాగు పొంగి ప్రవహించి పోచారం ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. దీంతో పోచారం ప్రాజెక్టు అలుగులు అంతెత్తు దూకుతున్నాయి. ఎగువన కురుస్తున్న వర్షాలతో మంజీర నదికి భారీ వరద వచ్చింది. దీంతో నిజాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారి గురువారం సాయంత్రం నాలుగు గేట్లు ఎత్తారు. భారీ ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలతో ఆరు ఇండ్లు పూర్తిగా, 284 ఇండ్లు పాక్షికంగా ధ్వంసమైనట్లు జిల్లా అధికారులు పేర్కొన్నారు.

పొంగి ప్రవహిస్తున్న వాగులు..

జిల్లాలో వాగులన్నీ పొంగి ప్రవహిస్తున్నాయి. భీమేశ్వర వాగు, పాల్వంచ వాగు, కూడవెల్లి వాగు, మొండి వాగు, లొట్టి వాగు, పెద్దవాగు, లెండి వాగులు పెద్దఎత్తున ప్రవహిస్తున్నాయి. వాగుల ప్రవాహంతో చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.

నీట మునిగిన పంటలు..

జిల్లాలో తెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు పొంగి ప్రవహిస్తుండగా, వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. బిచ్కుంద, మద్నూర్, పిట్లం, పెద్దకొడప్‌గల్, జుక్కల్, గాంధారి, లింగంపేట తదితర మండలాల్లో ఎక్కువ మొత్తంలో పంటలు నీట మునిగినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పత్తి, సోయా పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో వరి పంట కూడా నీట మునిగింది.




లింగాయిపల్లిలో కూలిన ఇంటి ఎదుట బాధితురాలు



లింగంపేటలోని నాగారం వద్ద వంతెనపై వరద



మద్నూర్‌లో నీటిలో మునిగిన సోయాబీన్



నిజాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి విడుదలవుతున్న నీళ్లు

'కౌలాస్' ఐదు గేట్లు ఎత్తివేత

- ఇన్‌ఫ్లో 50,600 క్యూసెక్కులు
- అవుట్‌ఫ్లో 20,000 క్యూసెక్కులు

నిజాంసాగర్(జుక్కల్) : మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని కౌలాస్ ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తింది. ఎగువ నుంచి వరద నీరు ఉధృతంగా వస్తుండటంతో గురువారం కౌలాస్ ప్రాజెక్టు ఐదు వరద గేట్లను జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే, నీటిపారుదలశాఖ సీఈ శ్రీనివాస్ చేతుల మీదుగా ఎత్తివేశారు. కౌలాస్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు 1.237 టీఎంసీలకు గాను ప్రస్తుతం 4,578.75 మీటర్లు 1.176 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 50,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అవుట్‌ఫ్లో 20,000 క్యూసెక్కులు ఉందని ప్రాజెక్టు ఏఈ రవిశంకర్ తెలిపారు.



స్విచ్ వేసి గేట్లను ఎత్తుతున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

నిజాంసాగర్ నాలుగు గేట్లు..

నిజాంసాగర్(జుక్కల్) : నిజాంసాగర్ ప్రాజెక్టు 4 వరద గేట్లను ఎత్తి వేసి 20 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 54 వేల 400 క్యూసెక్కుల చొప్పున వరద నీరు నిజాం సాగర్ ప్రాజెక్టులోకి వస్తోంది. ఎగువ నుంచి ఉధృతి కారణంగా గేట్లను ఎత్తి వేసి నీటిని విడుదల చేస్తున్నామని జిల్లా నీటిపారుదలశాఖ సీఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు 17.8 టీఎంసీలకు గాను ప్రస్తుతం 1403.42 అడుగులు 16.012 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



ప్రాజెక్ట్ గేట్లను ఎత్తుతున్న అధికారులు


పొంగిపొర్లిన 'సింగితం'



వరద గేట్ల వద్ద నీరు

నిజాంసాగర్(జుక్కల్) : ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద కారణంగా గురువారం సాయంత్రానికి సింగితం రిజర్వాయర్ పోటెత్తింది. వరద గేట్లపై నుంచి వరద పారింది. బాన్సువాడ, వర్ని, నిజాంసాగర్ మండలాల్లో కురిసిన వర్షాలకు 14,500 క్యూసెక్కుల మేర వరద ఇన్‌ఫ్లోగా వస్తోంది. దాంతో రిజర్వాయర్ వరద గేట్లు వరద నీటితో మునిగిపోయాయి. మత్తడి అలుగుపై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. రిజర్వాయర్ వరద తాకిడితో ప్రమాదపుటంచున ఉంది.

పరవళ్లు తొక్కుతున్న 'పోచారం'



పొంగిపోర్లుతున్న పోచారంప్రాజెక్టు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి):నాగిరెడ్డిపేట మండలంలోని పోచారంప్రాజెక్టు భారీగా వరదనీటి చేరికతో పరవళ్లు తొక్కుతోంది. బుధవారంరాత్రి వరకు 4,614 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా రాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 36,129 క్యూసెక్కులకు చేరుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో భారీగా వచ్చి చేరుతున్న వరదనీరు ప్రాజెక్టు అలుగు పైనుండి పోచారం పెద్దవాగు ద్వారా మంజీర నదిలోకి ప్రవహిస్తుంది. ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్న వరదనీటిలో 20 క్యూసెక్కులు పోచారం ప్రధాన కాలువలోకి విడుదలవుతోంది. మిగిలిన 36,109 క్యూసెక్కుల నీరు అలుగు పైనుండి దిగువకు ప్రవహిస్తూ మంజీర ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వెళ్తుంది. కాగా గురువారం ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు పోచారం ప్రాజెక్టుకు చేరుకొని నీటిమట్టాన్ని పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ సిబ్బందిని ఆయన ఆదేశించారు.

రోగిని వాగు దాటించిన పోలీసులు



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల కేంద్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల్లో పోలీసులు తమవంతు సేవలందిస్తున్నారు. గురువారం మండలంలోని అమర్లబండ గ్రామానికి వెళ్లే దారి మధ్యలో ఉన్నవాగు విపరీతంగా పారుతుండడంతో రాకపోకలు నిలిచాయి. గ్రామానికి చెందిన సుంకరి దివ్య అనే మహిళకు ఛాతినొప్పి, జ్వరం రాగా వైద్యం నిమిత్తం పోలీసులు ఆమెను కేజీవీల్ ట్రాక్టర్ పై కూర్పేబెట్టి వాగు దాటించి పోలీసు వాహనంలో ఆస్పత్రికి తరలించారు. సదాశివనగర్ మండల కేంద్రంలో పాత పోస్టాఫీస్ వద్ద డ్రైనేజీ నిండి పోగా ఏఎస్సై నర్సయ్య, హెడ్‌కానిస్టేబుల్ సాయిలు, కానిస్టేబుళ్లు హమీద్, బంతిలాల్ శుభ్రం చేశారు.

కల్యాణికి పోటెత్తిన వరద

- నాలుగు గేట్ల ఎత్తివేత



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మండలంలోని కల్యాణి ప్రాజెక్టుకు వరద పోటెత్తినట్లు ఏఈ శివప్రసాద్ గురువారం తెలిపారు. ప్రాజెక్టులోకి 5 వేల క్యూసెక్కుల వరద నీరు రావడంతో ప్రాజెక్టుకు సంబంధించిన 4 వరద గేట్లను ఎత్తి మంజీరాలోకి నీటిని వదిలినట్లు ఆయన తెలిపారు. పైన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టుకు వరద తీవ్రత పెరిగిందన్నారు.

అన్నల యాదిలో..!

- విప్లవోద్యమంలో తనువు చాలించినవారెందరో..
- నేటి నుంచి అమరుల సంస్మరణ వారోత్సవాలు

సాక్షి, కామారెడ్డి : భూమి..భుక్తి.. విముక్తి కోసం ఐదు దశాబ్దాలుగా సాగుతున్న విప్లవోద్యమంలో ఉమ్మడి జిల్లాల్లో దాదాపు 185 మంది తమ ప్రాణాలను అర్పించారు. అప్పట్లో పీపుల్స్‌వార్ నక్సలైట్ ఉద్యమం బలంగా ఉండి కొన్ని ప్రాంతాల్లో సమాంతర పాలన సాగించింది. తర్వాతి కాలంలో ఆ పార్టీ సీపీఐ మావోయిస్టు పార్టీగా అవతరించింది. కాగా నక్సలైట్ ఉద్యమ నిర్మాత చారుమజుందార్ వర్ధంతి సందర్భంగా ప్రతీఏటా జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు వారం రోజుల పాటు అమరుల సంస్మరణ దినోత్సవాలు నిర్వహిస్తుంటారు. జిల్లాలో నక్సలైట్ ఉద్యమం కనుమరుగైనా, జిల్లాకు చెందిన పలువురు మావోయిస్టు ఉద్యమంలో దండకారణ్యంలో కీలక భూమిక పోశిస్తున్నారు. పోలీసు నిర్బంధం పెరగడంతో చాలామంది నక్సల్స్ లొంగిపోయారు. మరెందరో ఎన్‌కౌంటర్లలో అసువులు బాశారు. నిర్బంధం పెరగడంతో రెండు జిల్లాలకు చెందిన పలువురు అజ్ఞాత నక్సలైట్లు ఇతర రాష్ట్రాలకు వెళ్లారు. కామారెడ్డి జిల్లాకు చెందిన లోకోటి చందర్ అలియాస్ స్వామి రాష్ట్ర కమిటీ సభ్యుని హోదాలో దండకారణ్యంలో పనిచేస్తున్నారు. ఆయన భార్య సులోచన కూడా ఆయనతో పాటే వెళ్లి కొంత కాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. వారి కొడుకు రమేశ్, కూతురు లావణ్య కూడా అజ్ఞాతంలోనే ఉన్నారు. మాచారెడ్డి మండలం ఆరెపల్లికి చెందిన ఎర్రగొల్ల రవి విద్యార్థి దశలోనే విప్లవోద్యమంలో చేరి మూడు దశాబ్దాలుగా ఉద్యమంలో ఉన్నారు.



ఎందరో నేలకొరిగారు..

అప్పట్లో పీపుల్స్‌వార్ జిల్లా కమిటీ సభ్యులుగా పనిచేసిన సలీం, వినోద్, సుధీర్, సంతోష్, జనార్దన్, జ్యోతి,నవీన్,స్వరూప,ఐలన్న,అమర్,దయానందరెడ్డి ఎన్‌కౌంటర్లలో మరణించారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 185 మంది ఎన్‌కౌంటర్లలో చనిపోయారు.

గుర్తుగా అమరుల స్తూపాలు..

ఉమ్మడి జిల్లాలో కొనసాగిన మానాల గ్రామంలో రెండు దశాబ్దాల క్రితం 40 అడుగుల ఎత్తైన మహిళా నక్సల్స్ అమరుల స్మారక స్తూపం నిర్మించారు. ఇది ఆసియా ఖండంలో రెండోదిగా చెబుతారు. కామారెడ్డి మండలం గూడెంలో గూడెం బాల్‌రాజు విగ్రహంతో స్తూపం కట్టారు. మాచారెడ్డిలోని రెడ్డిపేటలో భారీ స్తూపం నిర్మించారు. సదాశివనగర్‌లోని గిద్దలో గ్రామానికి చెందిన నక్సల్ నేతలు దయానందరెడ్డి, నారాయణరెడ్డిల విగ్రహాలు ఏర్పాటు చేశారు. జిల్లాలోలోని కొండాపూర్, పోల్కంపేట, ఇసాయిపేట, సోమార్‌పేట, ఎల్లారెడ్డిపల్లి, కొండాపూర్.. ఇలా ఎన్నో గ్రామాల్లో స్తూపాలు నిర్మించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లాలో రికార్డు స్థాయిలో వర్షాలు
- అధికారుల సూచనలు పాటించాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం : రికార్డు స్థాయిలో వర్షాలు పడుతున్నాయని, జిల్లాకు భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో వాతావరణశాఖ హైఅలర్ట్ ప్రకటించినందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్, జూమ్ మీటింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు వెళ్లవద్దన్నారు. ప్రయాణాలు వాయిదా వేసుకోవాలన్నారు. చిన్న పిల్లలు బయటకు వెళ్లకుండా చూసుకోవాలన్నారు. కౌలాస్ నాలా ప్రాజెక్ట్ నుంచి నీరు విడుదల చేస్తునందున ప్రాజెక్ట్ లోతట్టు ప్రాంతాల్లోని చిన్నతక్కడ్ పల్లి, తూద్గల్ గ్రామాలు తదితర ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాజెక్ట్ పరిధిలోని దామరంచ, గుండె నెమలి, పులకల్, గోజేగావ్, సిర్పూర్ లోతట్టు గ్రామ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్‌సమస్యలు ఉంటే అధికారులకు తెలియజేయాలన్నారు. స్తంభాలను తాకరాదన్నారు. జిల్లాలో గర్భిణులు ఇబ్బందులెదురైతే హెల్ప్‌లైన్ 08468 220069ను సంప్రదించాలన్నారు. వైద్యాధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు అప్రమత్తంగా ఉండాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండవద్దని, స్థానికంగా అధికారులు ప్రభుత్వ భవనాల్లో పునరావాస కేంద్రాలకు వెళ్లాలన్నారు. పోలీసు, ఫైర్, రెవెన్యూ, పంచాయత్ రాజ్, ఆర్అండ్‌బీ, నీటిపారుదల తదితర ముఖ్య శాఖల అధికారులు అందరు క్షేత్రస్థాయిలో అప్రమత్తం ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్‌రావు, డీఎల్‌పీవోలు అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగులకు భద్రత కల్పించాలని వినతి



కామారెడ్డి అర్బన్: పదేళ్లుగా వివిధ శాఖల్లో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి సమస్యలు పరిష్కరించాలని గురువారం టీఎన్‌జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డిని కలిసి ఉద్యోగులుఉ వినతి పత్రం అందజేశారు. జిల్లా స్థాయిలో సమస్యలుంటే పరిష్కారానికి ఉన్నతాధికారులతో మాట్లాడతామని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, బి.సాయిలు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా నాయకులు సంతోష్ కుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'డీఎస్సీ-2003 టీచర్లకు పాత పెన్షన్ ఇప్పిస్తాం'



కామారెడ్డి అర్బన్: డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను ఆగస్టులోగా ఇప్పిస్తామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కె.రఘోత్తమరెడ్డి అన్నారు. గురువారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో డీఎస్సీ-2003 పాత పెన్షన్ పోరాట సమితి నాయకులు ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డితో పాటు పలువురిని కలిశారు. పీఆర్‌టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లా అధ్యక్షుడు పి.దామోదర్ రెడ్డి అన్నారు. పాత పెన్షన్ ఇప్పించే బాధ్యత పీఆర్‌టీయూదేనని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.శ్రీపాల్‌రెడ్డి అన్నారు. పాత పెన్షన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, బాధ్యులు దుర్గాప్రసాద్, రాజు, నాగరాజు, అనిల్, సంగెం శ్రీనివాస్ తదితరులున్నారు.

ఇంటర్‌నెట్ సేవల పునరుద్ధరణ

సుభాష్‌నగర్: నగరంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రెండ్రోజులుగా నిలిచిన ఇంటర్నెట్ సేవలు గురువారం సాయంత్రం పునరుద్ధరించబడ్డాయి. ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడంతో సర్వర్ డౌన్ అయి సుమారు 45 వరకు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు కాలేదు. కార్యాలయానికి సంబంధించి ఇంటర్నెట్ తీగలు తెగిపోవడంతో సమస్య వచ్చిందని అధికారులు పేర్కొంటున్నారు. సమస్యను గుర్తించి, వేరే చోటు నుంచి నూతనంగా ఇంటర్నెట్ తీగలు తీసుకుని సేవలను ప్రారంభించామని వారు తెలిపారు. రెండ్రోజులపాటు రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తంచేశారు.

నోట్లు పంచే పార్టీలను ఓడించండి

- ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడే శక్తులను గెలిపించాలి
- బీఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నల్లా సూర్యప్రకాశ్



మాట్లాడుతున్న బీఎల్‌పీ నేత నల్లా సూర్యప్రకాశ్

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో మద్యం, నోట్లను ప్రజలకు పంచిపెడుతున్న పార్టీలను ఓడించాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నల్లా సూర్యప్రకాశ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ లాంటి ఆధిపత్య కులాల రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యంపై నమ్మకం లేక మద్యం, ఓటుకు నోటు ద్వారా ఎన్నికల్లో గెలుస్తున్నారని విమర్శించారు. అలాంటి పార్టీలను ఓడించడం ద్వారా ప్రజాస్వామ్యం బాగుపడుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారం లక్ష్యంగా ఏర్పడిన బహుజన లెఫ్ట్ పార్టీ 2024 ఎన్నికల్లో పోటీ చేస్తుందని చెప్పారు. బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు దండి వెంకట్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 93% ఉన్న బహుజన ప్రజల చేతిలో రాజకీయ అధికారం 10% మాత్రమే ఉందన్నారు. బహుజన మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న మహిళలపై దాడులను తిప్పికొట్టాలన్నారు. కామారెడ్డి బీఎల్ఎఫ్ ఎమ్మెల్యే అభ్యర్థి సిరిగాద సిద్దిరాములు, రాష్ట్ర నాయకులు ఎం.అంజనేయులు, జిల్లా నాయకులు వడ్ల సాయి కృష్ణ, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

నరేంద్ర మోదీ రైతుల పక్షపాతి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న యెండల లక్ష్మీనారాయణ

కామారెడ్డి టౌన్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రైతుల పక్షపాతి అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గాంధీగంజ్‌లో కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. ప్రతి సంవత్సరం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వడ్ల ధరలు పెంచుతున్నారని తెలిపారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చినప్పుడు క్వింటాలు వడ్లు రూ.1,300 ఉంటే ఇప్పుడు రూ.2200కి పెంచారని గుర్తు చేశారు. యూరియా, డీఏపీ వంటి ఎరువులు రైతులపై భారం పడకుండా సబ్సిడీ కల్పిస్తుందని అన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతుల ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నరేంద్రమోదీ ప్రసంగాన్ని బీజేపీ నాయకులు లైవ్ ద్వారా వీక్షించారు. బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నీలం చిన్నరాజులు, కౌన్సిలర్లు మొటూరి శ్రీకాంత్, నరేందర్, శ్రీనివాస్, తదితరులున్నారు.

విద్యార్థుల శ్రేయస్సుపై శ్రద్ధ ఏది?

- ఉపాధ్యాయులపై మండిపడ్డ జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్



బీబీపేట కస్తూర్బా పాఠశాలలో వర్షపు నీరు

బీబీపేట: భారీ వర్షాలతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని స్థితిలో ఉన్న విద్యార్థుల గురించి పట్టించుకోకుండా ప్రిన్సిపల్ మంగ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం భారీ వర్షాల దృష్ట్యా మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా పాఠశాలను మండల ప్రజాప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఆ సమయంలో పాఠశాల ఆవరణ చెరువును తలిపించేలా నీళ్లు ఉండడంతో అధికారులెవరికి చెప్పకుండా ఏం చేశారని స్థానిక సిబ్బందిని ప్రశ్నించారు. వర్షం కురుస్తున్న సమయంలో ప్రిన్సిపల్ మంగ ఇంటి దగ్గర ఉంటే విద్యార్థుల బాగోగులు ఎవరు చూస్తారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. విద్యార్థులకు కళ్లకు వ్యాధి సోకిందని, ఈ విషయం గోప్యంగా ఎలా ఉంచుతారని అన్నారు. వర్షపు నీళ్ల గురించి కలెక్టర్‌కు వివరించారు. స్థానికంగా ప్రిన్సిపల్ లేకపోవడంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట ఉపసర్పంచ్ సాయినాథ్, సత్యనారాయణ, బొశెట్టి నాగేశ్వర్, నాగరాజ్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

నిండిన అండర్‌పాస్ రైల్వే బ్రిడ్జి

- రాకపోకలకు అంతరాయం



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సరంపల్లి గ్రామ శివారులోని ఫర్‌ఫెక్ట్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ వద్ద అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి నిండిపోయింది. ఈ ప్రాంతంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. హనుమాన్ ఆలయానికి వెళ్లే భక్తులకు, రైతులకు ఇబ్బందులు తలెత్తాయి. రైల్వే అధికారులు స్పందించి అండర్ పాస్ వద్ద నిలిచిన నీటిని తొలగింపచేయాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

లాడ్జిలో యువకుడి ఆత్మహత్య

కామారెడ్డి క్రైమ్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లికి చెందిన రవిచంద్ర(26) అనే యువకుడు ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉద్యోగాల కోసం ప్రయతిస్తున్నాడు. సరైన ఉద్యోగం రాకపోవడంతో పాటు ఇటీవల ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. దీంతో మనస్థాపం చెంది కొత్త బస్టాండ్ ప్రాంతంలోని ఓ లాడ్జిలో గురువారం మధ్యాహ్నం రూం అద్దెకి తీసుకొని కొద్దిసేపు గడిపాడు. సాయంత్రం సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో నరేశ్ తెలిపారు.

మున్నూరుకాపులకు అన్యాయం జరిగింది

- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రత్యేక పథకాలు తెస్తాం
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీబీపేట నేతలు

కామారెడ్డి టౌన్: బీబీపేట మండలానికి చెందిన ఆయా పార్టీల నేతలు, మున్నూరూకాపు సంఘాల నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో పార్టీలో చేరగా, వారికి కండువాలు కప్పి ఆయన ఆహ్వానించారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ..బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మున్నూరుకాపులకు ఎలాంటి ప్రత్యేక పథకాలు అందలేవన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మున్నూరుకాపులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని షబ్బీర్ అలీ కోరారు. బీబీపేట మండల అధ్యక్షుడు సుతారి రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు భూమాగౌడ్, తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ప్రగతి భవన్ ముట్టడిస్తాం



కలెక్టరేట్ ఎదుట వర్షంలో ధర్నా చేపడుతున్న జీపీ కార్మికులు

కామారెడ్డి టౌన్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని గ్రామ పంచాయితీ కార్మికుల సంఘాల జిల్లా చైర్మన్ వెంకట్ గౌడ్ తెలిపారు. గురువారం వర్షంలో గొడుగులు పట్టుకుని కలెక్టరేట్ ముందు గ్రామపంచాయతీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..22 రోజులుగా 50 వేల మంది సమ్మె చేస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కార్మికులను క్రమబద్ధీకరించి వారికి కనీస వేతనాలు అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, మోతి రాం, జీపీ కార్మికులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని కానిస్టేబుల్ ఆత్మహత్య..



నరేష్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: ఉరి వేసుకుని ఓ ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గురువారం ఉదయం వెలుగు చూసింది. రాజంపేట మండలం బస్వన్నపల్లి గ్రామానికి చెందిన ఏలేటి నరేష్ రెడ్డి (30) ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి భార్య వర్షిణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాలుగేళ్ల క్రితం సొంత ఇల్లు కట్టుకుని కామారెడ్డిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో స్థిరపడ్డాడు. ప్రస్తుతం అతడు జిల్లా పోలీసు కార్యాలయంలో పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో అందరూ కలిసి భోజనం చేసి పడుకున్నారు. కొద్దిసేపటి తర్వాత ఇంట్లోని మరో గదిలోకి వెళ్లి కొక్కానికి వైర్‌తో ఉరి వేసుకున్నాడు. యేడాదిగా అతడు కడుపునొప్పితో బాధపడుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా కడుపు నొప్పి తగ్గకపోవడంతోనే జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. కుటుంబ సమస్యలు కావచ్చని మరికొందరు భావిస్తున్నారు. కడుపు నొప్పి కారణంగా తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌ఓ నరేష్ తెలిపారు.

నాడు కూతురు మృతి.. నేడు కొడుకు ఆత్మహత్య

చెట్టంత ఎదిగిన కొడుకు ఉరేసుకుని చనిపోయాడని తెలిసిన ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తుంటే అందరూ కంటతడిపెట్టారు. దేవుడు మాకెందుకీ శిక్ష విధించాడని రోధించారు. రాజంపేట మండలం బస్వన్నపల్లి గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ ఏలేటి నరేశ్‌రెడ్డి (30) బుధవారం రాత్రి కామారెడ్డిలోని ఇంట్లో ఉరేసుకుని చనిపోయాడు. సొంతూళ్లో ఉంటున్న తల్లిదండ్రులు మహిపాల్‌రెడ్డి, రాధ కొడుకు మరణవార్త విని కుప్పకూలిపోయారు. వృద్ధాప్యంలో తమను సాకుతాడని కలలు గన్న తల్లిదండ్రులకు కన్నీరే మిగిలింది. 2005లో వారి కూతురు జయంతి అనుమానాస్పద స్థితిలో చనిపోయింది. కబడ్డీ క్రీడాకారిణి అయిన ఆమె జాతీయస్థాయి క్రీడాకారిణిగా గుర్తింపు పొందింది. పెళ్లయిన కొంత కాలానికే ఆమె మృతి చెందింది. అప్పుడు ఎదిగిన కూతురు, ఇప్పుడు ఎదిగిన కొడుకు చనిపోవడంతో ఆ తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలింది.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఉన్నతాధికారులు

రాజంపేట : రాజంపేట మండలం బస్వన్నపల్లి గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ ఏలేటి నరేష్ రెడ్డి(37) మృతిచెందగా ఆయన అంత్యక్రియల్లో ఓఎస్డీ ఎస్పీ అన్యోన్య, ఆర్‌ఐలు, ఎస్సైలు, రాజంపేట పోలీసు సిబ్బంది గురువారం మధ్యాహ్నం బస్వన్నపల్లికి చేరుకుని ఆయన మృతదేహానికి నివాళులు అర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

అడవి పందుల దాడిలో చెరుకు పంట ధ్వంసం



భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రా మంలో గురువారం అడవి పందుల దాడిలో నాలుగు ఎకరాల చెరుకు పంట ధ్వంసమైంది. గ్రామానికి చెందిన పెద్ద సాయిలుకు గ్రామశివారులో ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో నాలుగు ఎకరాల్లో చెరుకు పంటను సాగు చేస్తున్నాడు. గురువారం వేకువజామున అడవి పందులు పెద్ద సంఖ్యలో వచ్చి చెరుకు పంటను పూర్తిగా ధ్వంసం చేశాయి. ఉదయం చేనుకు వచ్చిన అతడు ధ్వంసమైన పంటను చూసి రోధించాడు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం చెల్లించాలని బాధితుడు ప్రభుత్వాన్ని కోరారు.

క్రైం కార్నర్

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు



మృతదేహన్ని పరిశీలిస్తున్న ఎస్సై కోనా రెడ్డి...

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలకేంద్రంలోని జాతీయ రహదారి 161పై ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నాందేడ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఇన్నోవా కారు గురువారం ఉదయం పెద్దకొడప్‌గల్ సమీపంలోని జాతీయ రహదారిపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్రేన్ సహాయంతో కారులో ఉన్న ఇద్దరిని బయటకు తీశారు. వారిలో షేక్ ముస్తాక్(24) మృతిచెందగా, అబ్దుల్ అర్బుజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి అజిమొద్దిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడు గల్లంతు



గల్లంతైన ఎల్లప్ప

నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని కౌల్పూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి, గల్లంతయ్యాడు. వివరాలు ఇలా.. మండలంలోని కౌల్పూర్ గ్రామానికి చెందిన పోచమ్మల ఎల్లప్ప(35) గురువారం అదే గ్రామానికి చెందిన మిగతా ఐదుగురితో కలిసి షాపూర్ శివారులో గల కుద్వాన్‌పూర్ చెరువు అలుగు దగ్గర చేపలు పట్టేందుకు వెళ్లారు. ఎల్లప్పతో పాటు మరో వ్యక్తి దుర్గయ్య అలుగులోకి దిగగా, ప్రవాహం ఉధృతంగా ఉండడంతో బయటకు వచ్చే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో ఎల్లప్ప గల్లంతవ్వగా, తనతో పాటు దిగిన వ్యక్తి ప్రవాహంలో కొద్ది దూరం కొట్టుకుపోయి ప్రాణాలతో బయటపడ్డాడని స్థానికులు తెలిపారు. ఘటన స్థలాన్ని తహసీల్దార్ అనిల్ కుమార్, ఏఎస్సై వెంకటేశ్వర్లు సందర్శించి, గాలింపు చర్యలు చేపట్టారు.

భార్యాభర్తలకు పాముకాటు

- సకాలంలో ఆస్పత్రిలో చేరిక
- తప్పిన ప్రాణాపాయం



చికిత్స పొందుతున్న ముద్రిచ్చ నీలా

రాజంపేట: మండలంలోని శేర్‌శంకర్‌తండాకు చెందిన భార్యభర్తలు ముద్రిచ్చ రమేష్, నీలాలు బుధవారం అర్ధరాత్రి పాముకాటుకు గురయ్యారు. దీంతో అప్రమత్తమైన భార్యభర్తలు వారి సొంత వాహనంలో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలివెళ్లారు. సమయానికి ఆస్పత్రికి చేరడంతో వైద్యులు వారికి మెరుగైన చికిత్స అందించి వారి ప్రాణాలను కాపాడారు. ప్రసుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపినట్లు తండావాసులు పేర్కొన్నారు.

గొర్రెల మందపై చిరుతపులి దాడి

- మూడు గొర్రెలు మృతి.. మరొక గొర్రెకు గాయాలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని కాటేపల్లి గ్రామ శివారులో గొర్రెల మందపై చిరుత దాడి చేయగా, మూడు గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల యజమాని బాగన్న తెలిపిన వివరాలు ఇలా.. కాటేపల్లి గ్రామ బృహత్ పల్లె ప్రకృతి వనం సమీపంలో గురువారం మధ్యాహ్నం గొర్రెలమందపై చిరుతపులి దాడి చేసింది. దీంతో కాటెపల్లి తండాకు చెందిన కిషన్, పంతిలాల్, జత్తుల ఒక్కో గొర్రె మృతి చెందింది. భాగన్న గొర్రెకు గాయలు అయ్యాయి. అటవీశాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు.

దంపతుల హత్య జూదరుల పనేనా..?

- పేకాటను నియంత్రించడంలో.. పోలీసుల వైఫల్యం
- జూదం అడ్డాల లొకేషన్ పంపినా పట్టించుకోని వైనం
- రైతునగర్‌లో జంట హత్యలకు గల కారణాలపై అనుమానాలు

బాన్సువాడ : బాన్సువాడ ప్రాంతంలో జోరుగా పేకాట అడ్డాలు వెలుస్తున్నాయి. ఊరికో అడ్డాను ఏర్పాటు చేసుకుని జోరుగా పేకాటాడుతున్నారు. పేకాటను నియంత్రించడంలో పోలీసులు ఎందుకంతా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో ప్రజలు చర్చించుకుంటున్నారు. రెండు రోజుల క్రితం బీర్కూర్ మండలం రైతునగర్‌లో జరిగిన వృద్ధ దంపతుల హత్యకు పేకాటరాయుళ్లకు ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. గతంలో పేకాట స్థావరాల లోకేషన్‌ను పోలీసులకు పంపినా స్థావరాలపై దాడులు చేసేందుకు పోలీసులు వెనుకడుగు ఎందుకు వేశారనే చర్చ జరుగుతోంది. బాన్సువాడ, బీర్కూర్, నస్రూల్లాబాద్ మండలాల్లో పేకాట అడ్డాలు జోరుగా కొనసాగుతున్నాయి. బీర్కూర్ మండలంలో ఊరికో పేకాట అడ్డాను ఏర్పాటు చేసుకుని పేకాటను నిర్వహిస్తున్నారు. బీర్కూర్ మండలంలోని ఓ క్యాంపు, కిష్టాపూర్, దామరంచ, బీర్కూర్ మంజీర పరివాక ప్రాంతాల్లో, మిర్జాపూర్ చెరువు కట్ట, నస్రూల్లాబాద్ మండలం కంపల గండి, బోమ్మన్ దేవ్‌పల్లి, నెమ్లి, దుర్కి శివారు, బోప్పాస్‌పల్లి, బాన్సువాడ పట్టణంలోని తాడ్కోల్ రోడ్డులో, బోధన్ రోడ్డు బస్‌డిపో సమీపంలో, ముదెల్లి అటవీప్రాంతం, ఇబ్రహీంపేట్ తాండ, చింతల్‌నాగారం శివారులో, ఎర్రమన్ను కుచ్చ తదితర ప్రాంతాల్లో పేకాట స్థావరాల్లో పేకాట జోరుగా కొనసాగుతుంది. బీర్కూర్ మండలంలో కొసాగుతున్న పేకాట అడ్డాల లోకేషన్‌ను కొందరు పోలీసులకు షేర్ చేసిన దాడులు చేసేందుకు వెనుకడుగు వేశారు. పోలీసులు పట్టించుకోకపోవడంతో పేకాటరాయుళ్ల మరి రెచ్చిపోయి పేకాట ఆడుతున్నారు. బాన్సువాడలో ఓ కానిస్టేబుల్ అన్ని తానై పేకాట అడ్డాను నడిపే నిర్వాహకులకు సహకరిస్తున్నట్లు సమాచారం. బాన్సువాడ నుంచి నిత్యం పదుల సంఖ్యలో పేకాట రాయుళ్ల దెగ్లూర్, నాందేడ్ తదితర ప్రాంతాలకు వెళ్లి పేకాట ఆడుతున్నారు.

వృద్ధ దంపతులను..

రెండు రోజుల కిత్రం బీర్కూర్ మండలంలోని రైతు నగర్ గ్రామంలో వృద్ధ దంపతులు నారాయణ, సులోచన దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ దంపతులకు ఎవరూ లేరు. రైతునగర్‌లో ఓ కిరాణా షాప్ నడుపుతున్నారు. వారి వద్ద ఉన్న డబ్బులను వడ్డీలకు ఇచ్చుకునేవారు. నారాయణ వద్ద ఎక్కువగా వడ్డీలకు తీసుకెళ్లేది పేకాటరాయుళ్లేనని తెలిసింది. ఈరోజు రూ.9 వేలు వడ్డీకి ఇస్తే మరుసటి రోజు వడ్డీతో కలిపి రూ.10 వేలు చెల్లించేలా ప్రామిసరీ నోటు రాసుకుని డబ్బులు ఇచ్చేవారని సమాచారం. ఇలా చాలా మందికి రూ. లక్షల్లో వడ్డీకీ డబ్బులు ఇచ్చినట్లు తెలిసింది. వడ్డీకి తీసుకున్న వారు తిరిగి చెల్లించడంలో ఆలస్యం కావడంతో వారిని నారాయణ నిలదీసినట్లు తెలిసింది. వడ్డీకీ డబ్బులు తీసుకున్న వారెవరైన దంపతులను హత్య చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హత్య చేసిన దండుగులు వారి వద్ద ఉన్న బంగారంతో పాటు నగదును దోచుకెళ్లినట్లు సమాచారం. అసలు వృద్ధ దంపతుల వద్ద ఉన్న బంగారమెంతా...నగదు ఎంతా అనే విషయంపై స్థానికులు చర్చించుకుంటున్నారు. పోలీసులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

పోలీసుల అదుపులో చోరీలకు పాల్పడిన వ్యక్తి

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంతోపాటు, చుట్టుపక్కల ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని పట్టణ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం కామారెడ్డిలోని గాంధీనగర్‌లోగల రెండు ఆలయాల్లో చోరీలు జరిగాయి. దొంగలు ఎవరనేది గుర్తించడం కోసం పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. గురువారం వేకువజామున సమయంలో మరో ఆలయం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ పాత నేరస్తుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. జిల్లాకేంద్రానికి చెందిన అతడు కొద్ది రోజులుగా మాచారెడ్డి చౌరస్తాలో నివాసం ఉంటున్నాడు. ఇటీవల జరిగిన చోరీలు చేసింది తానేనని అంగీకరించినట్లు తెలుస్తోంది.

ఏటీఎం చోరీ!

బిచ్కుంద(జుక్కల్): మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న ఇండియా వన్ ఏటీఎంను బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి దొంగతనానికి పాల్పడినట్లు తెలిసింది. రాత్రి పది గంటల నుంచి గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు ఏటీఎం చుట్టు తిరుగుతూ బస్టాండ్‌లోనే సంచరిస్తున్నట్లు సమీపంలోని హోటళ్లలో పనిచేసే వ్యక్తులు, అటునుంచి వెళ్లిన వ్యక్తులు తెలిపారు. దుండగులు ఏటీఎం డిస్‌ప్లే, బాక్స్ పగలగొట్టి ధ్వంసం చేసి పారిపోయారు. డబ్బులు పోయాయా లేదా అనేది ఏటీఎం నిర్వహకులు వచ్చి చూడాల్సి ఉంది.

ఐసీయూలో తప్పిన ప్రమాదం

- పీవోపీ షీట్ తొలగింపు



తొలగించిన పైకప్పు పీవోపీ షీట్

కామారెడ్డి టౌన్ : వారం రోజుల క్రితం కురిసిన వర్షానికి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పోస్ట్ ఆపరేటివ్ వార్డులో పైకప్పు పీవోపీ షీట్ కింద పడగా గురువారం అలాంటి సంఘటనే జిల్లా కేంద్రాస్పత్రిలో మళ్లీ జరిగింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆస్పత్రి అంతా ఊరుస్తోంది. ఐసీయూ విభాగంలో కూడా ఊరుస్తూ పీవోపీ షీట్ ఊడిపోయే స్థితికి చేరింది. అప్రమత్తమైన ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఆ పీవోపీ షీట్ కింద రోగులను వెంటనే ఇతర వార్డులకు తరలించారు. ఊడిపోతున్న పీవోపీ షీట్‌ను తీసివేయించారు. దీంతో రోగులు ఊపిరి పీల్చుకున్నారు. ఆస్పత్రిలో అన్ని విభాగాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. నాసిరకంగా పనులు చేపట్టంతో పీవోపీ ఊడిపోతూ ప్రమాదకరంగా మారిందని రోగులు వాపోతున్నారు. భారీ వర్షాల కారణంగా ఆస్పత్రి ఊరుస్తుందని సూపరింటెండెంట్ విజయలక్ష్మి తెలిపారు. ఐసీయూ విభాగంలో వర్షాలకు ఊరుస్తుండగా పైప్‌లైన్‌లు లీకేజీ అయి పీవోపీ ఊడిపోతోందన్నారు. మరమ్మతులు జరిపిస్తాయని, ఇన్‌పేషెంట్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.